## 69. ధ్యానం అంటే?

వందల కొద్దీ బౌద్ధ సన్యాసులు నివశించే ఓ బౌద్ధారామాన్ని ఓ చైనీస్ రాజు సందర్శించాడు. వారు నిద్రించే, వంటచేసే, భోజనాలు చేసే, సత్సంగం జరుపుకునే భవంతులన్నీ ఆ రాజుకి చూపించారు. ఐతే ఓ భవంతి గురించి ఏం చెప్పకపోవడంతో రాజు ఆసక్తిగా సన్యాసులు అందులో ఏం చేస్తారని అడిగాడు.

"అందులో ఏం చేయరు." జవాబు చెప్పాడు గురువు.

అందులోకి వెళ్ళిన రాజుకి కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్న బౌద్ధ సన్యాసులు కనబడటంతో అడిగాడు.

"మీరు అబద్ధం చెప్తారే? ఇక్కడంతా ధ్యానం చేస్తున్నారు కదా?"

"మీరు చూసింది తప్పు. సన్యాసులు శరీరంతో కాని, మనసుతో కాని ఏ పనీ చేయని చోటిది. వారంతా తమ స్వస్థితిలో వుంటారంతే." వివరించాడు గురువు.

## 70. ఈశ్వరుడు

ఆదిశంకరాచార్య పరంపరలోని ఓ గురువు తన శిష్యులకి అద్వైత పాఠాన్ని బోధిస్తున్నాడు. ఆ సందర్భంగా భగవద్గీతలోని ఓ శ్లోకాన్ని చదివాడాయన.

"ఈశ్వర సర్వ భూతానాం హృద్దేశేర్జున... అంటే ప్రపంచంలోని సర్వ జీవుల్లో ఒక్క ఈశ్వరుడే ఆత్మ రూపంలో ఉన్నాడు. మనం ఇతర జీవులకి ఏదైనా అపకారం చేస్తే సాక్షాత్తు ఆ పరమాత్మకి అపకారం చేసినట్లే." చెప్పాడు.

ఇంతలో రెండు ఏనుగులు ఘీంకారం చేస్తూ వీళ్ళ మీదకి వచ్చాయి. అందరికన్నా ముందు గురువే పరిగెత్తి పారిపోయాడు. ఏనుగులు వెళ్ళిపోయి అంతా తిరిగి కలుసుకున్నాక కొందరు శిష్యులు గురువుని అడిగారు.